వస్తూ ఆవిడని, మరదల్ని సినిమాహాలులో దింపి తిరిగి ఇంటికి బయలుదేరాను. నే నీ సినిమాల్ని చూసి చాలా కాలమయింది. 'నిషేధం' అని కాదుగాని మొత్తంమీద ఇప్పుడు వస్తున్న తరహా సినిమాలు చూడబుద్ధికాక! వాళ్ళ సరదా నేను చంపకూడదు కదా! అందువల్ల ఎవరో సినిమావారు వస్తున్నట్లు తెలిసి, ఆ సినిమా టిక్కట్లు ఎలాగోలా కొని వాళ్ళని పంపించానన్న మాట!

"ఎక్కడ నుంచి గురువా రాక?" అన్నాడు సుబ్బారావు నాకు ఎదురుగా నిలబడి.

"సినిమా వానల్లు చూసి ఇంటికి పోతున్నాను" అన్నాను నవ్వుతూ.

అతనూ నవ్వి "అదృష్టవంతుడివి. ఆ చేత్తోటే హోటలు కొకదానికి వెళ్ళి లోపలికి తొంగిచూస్తే కడుపు నిండిపోతుంది" అన్నాడు.

"కొంపకేనా వెడుతున్నావు?" అన్నాను.

"నీలాగా ఇప్పటినుంచీ ఇళ్ళకి వెళ్ళి కూర్చుంటే తోచవక్కరలేదూ నా లాంటి వాళ్ళకి?.... మీ ఇంటిదాకా నీకు తోడుగా వుండి అటు నుంచీ అలా వెళ్ళి ఒక పెగ్. తరువాత రెండాటలు-ఇన్ని జరుగుతే గాని ఈ జీవికి పగలు గడవదు."



సింగరాజు రామచంద్రమూర్తి

అతనికిల్లు పట్టదు. రోజంతా రోడ్డంట తిరిగినా తృప్తి కలగని వాళ్ళలో వాడు. కంటిమీదికి నిద్ర ముంచుక వస్తుంటే ఇంటికి పోయి పడుకుంటాడు. కేవలం 'నిద్రపోవుటకే ఇల్లు' అన్న భావన గల వాడు. "రోడ్డుమీద ఇంత మంది అందమయినవాళ్ళు తిరుగుతుండగా ఇంటికెలా పోయేది గురో? రాత్రి మొదటి ఆట అయినాకంటావు - తిరిగి ప్రయోగం ఉండదు. అప్పుడిక ఇల్లు" అదీ అతని సిద్ధాంతం.

అంతలోనే వెనకనుంచీ రిక్షా ఒకటి గంట ఫైరింజనులా మోగించుకుంటూ వస్తుంటే సుబ్బారావు చేయి పట్టుకుని ఒక్కలాగు లాగాను. క్షణంలో రిక్షా దూసుకు పోయింది.

"ఓర్నీ. ఎంత స్పీడో? ఈ మధ్య వీళ్ళ కిదొక ఫాషనయి పోయింది—మతి చెడేట్టు గంట కొట్టడం! ఏ కారుకిందో లారీకిందో పడి చస్తే గౌరవంఅన్నా దక్కుతుంది. బొత్తిగా రిక్షాకిందా, సైకిల్ కిందా- రక్షించావు గురో. అయినా డిసిప్లిన్ లేకుండా పోయింది. ఆ స్పీడ్ ఆపేవారు లేరుకదా!" అన్నాడు.

"దేన్ని ఎవరు ఆపగలరు చెప్పు? రోజూ మనం ఆడపిల్లల్ని పట్టిగా రోడ్డుమీద నానా మాటలూ అనే మగపిల్లల్ని చూడటం లేదూ వాళ్ళ నేమన గలుగుతున్నాం? రేప్ లేని న్యూస్ పేపరు పట్టుకురా చెబుతాను. రిపోర్టు చేసుకుని అల్లరి పడడం దేనికని నోరుమూసుకునే కేసులు కొల్లలు. మామూలు మనిషి అన్నిటికీ నోరుమూసుకుంటేబ్రతకగలడు. నోరు తెరిచిన నాడు వాడి బ్రతుకు దుర్భరం."

"అవును గురో. బస్సులాపించి మరీ పొడిచేస్తున్నారు జనాన్ని. చంపాక సరదాగా రోడ్డుమీద నడుస్తుంటే చూసినవాళ్ళు నోరేకాదు. కళ్ళు మూసుకుంటున్నారు. "వేయి రూపాయలకి మర్డర్ చేయబడును" అని బోర్డులు కట్టుకునే రోజులు వస్తాయేమో" నవ్వాడు సుబ్బారావు తన మాటకు తనే!


"ఇటొచ్చేస్తున్నావేటు? 'ఔషధసేవ' వగయిరా అయిపోయి ఇంటికి వెళ్ళిపోతున్నావేమి టప్పుడే?"


నవ్వాడు సుబ్బారావు. "అప్పుడేనా గురో, ఏడయినా కానిదేనా! ఇంకా మనకి మూడు నాలుగ్గంటలు గడవాలి. సినిమా అయ్యేదాకా ఉండరాదూ. నేనూ వచ్చేస్తా నీతోపాటు?"

"వస్తాలే. కాస్త బడలికగా వుంది. మరె వర్నయినా వెతుక్కో. వస్తా" అంటూనే అతని మాటలిక వినిపించుకోకుండా గబగబ నడిచాను.

రోడ్డు మీద జనం అడ్డంగా నడుస్తున్నారు. వారి మధ్య నుంచి దారి కనబడక చెవులు బద్దలయ్యేలా హారన్లు మోగిస్తున్నారు సిటీ బస్సుల, లారీల వారు. వాళ్ళ గోడు వీళ్ళకి పట్టదు. "భయం పోయింది. యాక్సిడెంటులో ఎవరన్నా పోలే క్షణం భయపడి మళ్ళీ మామూలుగా తిరిగేస్తున్నారు." అనిపించింది నాకు.

ఒక సినిమాహాలు పక్కన జనం గుమిగూడి పోయారు. అప్పటికంత రష్‌గా ఉంది. ప్రమాదమేమయినా జరిగిందేమోనని నేనూ గుంపులోకి తలదూర్చాను.






మా ఇంటిపక్క కుర్రాడగపడ్డాడు గుంపులో. "ఏమయిందోయ్" అన్నట్లు కనుబొమ్మలు ఎగరవేసి తలాడించాను.

నవ్వాడతను. "పేపరు సార్" అన్నాడు.

"ఇప్పుడు పేపరేమిటి" అన్నాను.

"అదేనండి పేపరు విజయవాడనుంచి ఇప్పుడు వస్తుంది—రేపటి పేపరు."

అర్థం కాలేదు నాకు. "రేపటి పేపరుకి ఇంత హడావుడేమిటి? ఏజన్లు లేవుగా ఇప్పుడేమి?" అన్నాను.

ఆ పక్కన మరొకడు కొంచెం చురుకయినవాడు కల్పించుకుని "చెప్పేదేమిటో సరిగ్గా చెప్పవేం?" అని వాడిని కోప్పడి "మా పరీక్ష లవుతున్నాయండి. రేపటి క్వొశ్చన్ పేపరు ఇక్కడకొస్తుంది కాసేపటిలో. అది మేమంతా రాసుకుని అప్పుడు చదువుకుంటాం" అన్నాడు తేట తెలుగులో.

"అదే వస్తుందని నమ్మకమా?"

"వస్తుంది — అదంతే!" అని నవ్వి "రోజూ వరస క్రమంతో సహా అవే ప్రశ్నలు వస్తుంటే యింకా అనుమానం దేనికి?" అన్నాడు.

"చదువుకునే టైమంతా వృధాకదూ! దానికోసం కూర్చునేబదులు చదువుకుంటే మంచిదికదూ!" అన్నాను మా యింటి దగ్గర కుర్రాడిని మందలింపు ధోరణిలో.

"ఎందుకండి అంతా చదవడం? టైమంతా వృధాకదా! పుస్తకం అంతా చదివి మనం రాసినా అవుటయినవాళ్ళు రాసినట్లుంటుందా? వాడే పాసవుతాడు- మేం తప్పుతాం." అన్నాడు మళ్ళా యిందాకటి వాడే. పాయింటే. కాని పేపరిది రాకపోతే మోసపోరూ?

ఇల్లు చేరుకున్నాను. గుమ్మం దగ్గరే కనబడింది కాంతి.

"ఆంటీ ఏదంకుల్" అంది నన్ను చూస్తూనే.

"నువ్వు మోసం చేశావుటగా మీ ఆంటీని సినిమాకి వస్తానని రాకుండా! వెడితేగాని వీల్లేదంది. నీ కోసం చూసేసరికి టైము అయిపోయింది. అందుకని నేను వెంట వెళ్ళి టిక్కెట్లిప్పించి లోపలికి పంపించి వచ్చాను" అన్నాను నవ్వుతూ.

"సారీ అంకుల్. మా అంకుల్ వచ్చే సరికి అమ్మ కాసేపు ఆపేసింది. అందుకని ఆలస్యమయి పోయింది."

"నాకెందుకు సారీలు. మీ ఆంటీ చెప్పు రేపొచ్చి. బాగా కోపం వచ్చింది తనకి!"

ముఖం ఎర్రబడిపోయింది శాంతికి. "పోనీ ఇప్పుడు వెళ్ళేదా అంకుల్ పిక్చర్ ఫాలో కాలేకపోయినా సరే లెట్ ది పిక్చర్ గో టు హెల్. ఆంటీకోపం వస్తే...."

"ఏం ఫర్లేదులే. ఇప్పుడు మళ్ళీ నీ వెంటొచ్చి నిన్ను హాల్లోకి పంపించే ఓపిక నాకు లేదు. హాయిగా నిద్రపోయి రేపు నేను ఆఫీసుకెళ్ళాక రా. నువ్వు. మీ ఆంటీ — క్షమాపణలు. కోపాలూ చెప్పుకుందురు గాని. టా. టా." అంటూనే తాళం తీసుకుని లోపలికి వెళ్ళిపోయాను.

ఖిన్నురాలై తిరిగి వెళ్ళింది శాంతి. ఈ అమ్మాయినెవరు చేసుకుంటారోగాని మహా అదృష్టవంతుడయుండాలి! చాలా అందమయిన పిల్ల. బుట్టెడు గులాబులు రాశి పోసినట్టుంటుంది. అంతగానూ సున్నితమయిన మనసు. స్వీట్ గాల్!

తలుపేసి. సిగరెట్ వెలిగించి. ఫాన్ ఫుల్ స్పీడ్‌లో పెట్టి మంచం మీద వాలాను. తలలో ఒకసారి మళ్ళీ ఇందాకటి సంఘటనలన్నీ మెదిలాయి. మందు.

# ముక్తకాలు

ధైర్ఘ్యమానం :

మీటర్ల లెక్కన వ్రాసిన పద్యాలు
మింగుడు పడకుండా పోతుంటే
సెంటీ మీటర సైజులో కవితలు
సెగలు గక్కుతూ ప్రజ్వలిస్తున్నాయి.

భాషాభేదం :

పేదవాడికి, పెద్ద వాడికీ
వర్ణక్రమంలో ఒక్కటే తేడా
పేదవాడికి దారిద్ర్యం దీర్ఘం
పెద్దవాడికి సంపద ద్విత్వం.

బ్లాక్ అండ్ వైట్ :

బజార్లు నల్లధనాన్ని పులుము
కుంటుంటే
భాగ్యవంతుడికి పరమానందం
తూరుపు దిక్కున తెల్లవారుతుందంటే
పూటగడవనివాడికి పుట్టెడు దుఃఖం

-సుపాణి

చీట్లాటలు. రేప్‌లు. యాక్సిడెంట్లు. కలీలు. చదువుపట్ల విద్వేషాలు. పేపరవుటవడాలు. తెలివిగలవాడు అణగ దొక్కబడటం— భగవాన్ ఎలా తయారయింది నీ సృష్టి? నీతి మంతుడికి. నిజాయితీ పరుడికీ రోజులేకుండా పోయాయి. అమాయకంగా పెరిగిన పువ్వుల్లాంటి ఆడపిల్లలకి ఈ దేశంలో రక్షణ లేదా? "సంభవామి యుగే యుగే" అనడమేగాని అమలు జరుగుతున్నట్లు లేదా వాగ్దానం—

నా కంటి కెదురుగా కాంతి కనబడింది. అది వెల్లబడి అందులో మధ్యగా దివ్య మంగళ విగ్రహం నవ్వుతూ "ఏమిటి అంటున్నావు?" అంది.

సంభ్రమాన్నించి కోలుకున్న వాడినై "ఏం లేదు స్వామి తమరు శివుడా విష్ణువా. రాముల వారా?...."

నవ్వాడాయన వెన్నెల్లా! "ఎవరయితే నీకేం. చెప్పు నీ అనుమానం" అన్నాడు.

"ఏం లేదు. భక్తి వున్నవాళ్ళకి వాళ్ళ భావనకి బలం కలిగించేలా రెండుమూడు మహత్యాలు తమరు చేయకపోవడం ఏమీ బావుండడంలేదు నాకు. అన్యాయం చేసిన వాడు బాగు పడిపోతుంటే మాకెలా ఉంటుంది!"

"ఎవరి కర్మ ఫలం వారనుభవిస్తారు. అది తప్పదు—పోనీ నువ్వు న్యాయంగా ఉంటున్నానంటావా?" నవ్వాడాయన.

"అహా. అలా అని కాదు. లతీలు సంపాయించే వారందరి కన్న నిజాయితీగానే ఉంటున్నాను. కాని రాను రాను తమరున్నారా లేరా అన్న అనుమానం కలుగుతోంది ఇదంతా చూసుంటే!"

"ఇలా నస పెట్టి ప్రాణం తీస్తావేం కన బడినసలు. నీ కేం కావాలి చెప్పు ముందు."


"ఏం కావాలని చెప్పను. ఎన్నని చెప్పను స్వామీ. అన్నీ ఇవ్వండి."

"అలా కుదరదు. చెప్పాను గదా. ఎవరి అదృష్టం బట్టి వారి జీవితం సాగవలసిందేనని."

"సరిగా అలా జరుగుతోందో లేదో ఎప్పుడంకీ చూసేవారు? మీకు న్యాయంగా అలాగే తూచి ఇస్తున్నారని మాకు నమ్మకం కుదిరేదెలా?"

నవ్వాడాయన. "అజ్ఞానివి. సరే. నీకైనువ్వే చూసే శక్తి నిస్తున్నాను. ఏ మనిషికేం జరుగుతుందో భవిష్యత్తు చూసే శక్తి నిస్తున్నాను. అది నీ స్వంత విషయంలో మాత్రం ఉపయోగపడదు. నువ్వు చూసిన దాన్ని అవతలి వారికి చెప్పి వారిని హెచ్చరించావో తల పగిలి చస్తావు." అంటూనే ఆయన మళ్ళీ కాంతి పుంజమయిపోయాడు. ఆ కాంతీ అదృశ్యమయిపోయింది.

"దేముళ్ళేమీ మారలేదు. ఎప్పుడూ తల పగిలి చస్తావని భయపెట్టడమే" అనిపించింది నాకు.



అంతలోనే కొత్తగా నేను పొందిన శక్తిని పరీక్షించుదామనిపించింది. వెంటనే వీథిన పడ్డాను—

శాంతి కనబడింది. పూలు కోసుకుంటోంది. "పువ్వుల్లో పూవ్వనై" అన్నట్లు వాటిలో కలిసి పోయింది. ఎంత మంచి పిల్ల. అందమయిన పిల్ల. భగవంతుడనే వాడుంటే ఇటువంటి వాళ్ళకి—నా దృషిని భవిష్యత్తులోకి పోనిచ్చాను.

మంగళ వాయిద్యాలు వినబడుతున్నాయి. పెళ్ళి పందిరి కనబడుతోంది. చిత్రం. మావిశ రంగురంగుల బట్టలు వేసుకుని నిలబడి వుంది.

పెళ్ళికూతురు, పెళ్ళికొడుకూ అలా ఆకాశంలో తేలుతున్నట్లు కదులుతున్నారు. అందరికీ దణ్ణాలు పెడుతున్నారు. గులాబుల దండ వేసుకుని వుంది శాంతి. కుంకుమ పువ్వుల రాశిలా ఉందా అమ్మాయి. ఎంతటి అదృష్టవంతుడీ అబ్బాయి. ఎవరా అబ్బాయి? అటు చూశాను. ఆజాను బాహువులతో నవనవలాడిపోతున్న వాడు. అందగాడు. సాక్షాత్తు శ్రీరాముడిలా వున్నవాడు. ఎవరో కాదు; శాంతికి అత్తయ్యకొడుకు.

"ఇంజనీరింగ్ చదువుతున్నాడు మా మేనల్లుడు. వాడికే శాంతి ప్రాణం. కాని మా బావ కట్నం అడుగుతున్నాడు మాస్టారూ" అన్నాడు మొన్ననే శాంతి వాళ్ళ నాన్న.

వధూవరులు మా ఆవిడ దగ్గరకు వచ్చేశారు. "అంకుల్ ఏరీ" అంటుందనుకున్న నాకు ఆశాభంగమే కలిగింది. మా ఆవిడముందు నమస్కారం పెట్టేందుకు వంగుతూ "మా బావ — తెలుసుగా—నా కోసం కట్నం వద్దన్నాడు" అంటోంది శాంతి మెల్లిగా.

ఆనందంతో కళ్ళు చెమ్మగిలాయి నాకు. యువతరం తిరగబడిందన్నమాట. శభాష్!

ఎదురుగా శాంతి పూలు కోస్తూనే ఉంది. భవిష్యతులోకి నా ప్రయాణం అయిపోయిందన్నమాట!

"శాంతీ దిగులు పడకు-" అంటూనే మధ్యలో ఆపేసి తల తడుముకున్నాను దేముడిగారి మాట గుర్తుకువచ్చి.

"ఏం టంకుల్" అని ఆ అమ్మాయి అంటున్నా అక్కడినుంచి కదిలాను.

వరండాలో కూర్చుని చదువుతున్నాడు మా ఇంటి దగ్గిర కుర్రాడు "ఏమోయ్, రాత్రి పేపరు వచ్చిందా?" అనడిగాను.

"వచ్చిందండి. చదవటం కూడా అయిపోయింది. ఇక వెళ్ళి రాయడమే" నవ్వాడతను.

మనసుకష్టం వేసింది నాకు. పరీక్షలింత తేలికయిపోతే ఇంక- భవిష్యత్తులోకి దృష్టి సారించాను-

పేపర్లో నెంబరు వెతుక్కుంటున్నాడు వీడు. ముఖం వెల వెల బోతోంది. పక్కన వాడి ఫ్రెండున్నాడు "ఫస్టు క్లాసులో చూడు గురూ. పేపర్లన్నీ తెలిసినవేగద ఉండక చస్తుందా నంబరు" అంటున్నాడు.

"అన్నీ ఎక్కడరా. ఆ రోజు సోషల్ పేపరు మోసం అయిపోయిందిగా. రాత్రంతా దాన్ని నమ్ముకున్నాము. అది కాస్తా రాలేదు. మొత్తం కొత్త పేపరేగా వచ్చింది-అనుమాన పడుతున్నాన్నేను" అన్నాడు వీడు.

వాడు తప్పాడన్న విషయ నిర్ధారణయిపోయింది. "దేముడు ఘట్టివాడే! పాపం ఏమిటో అనుకున్నాను" అనిపించింది. నాకు ....

సినిమా హాలుదగ్గర జనం కిటకిట లాడిపోతున్నారు. ఇసక దొరకదుగాని దొరికితే


*With best compliments from*

Telegrams : "TWINKLE" Telephones : 37 & 441

# East India Commercial Co. (Private) Ltd.

## Lessee : SRI KRISHNA JUTE MILLS, ELURU-534001. (A. P.)

Manufacturers of all varieties of Jute Gunny Bags including D. W. Flour Bags, Cement Bags, B. Twill Bags and A. Twill Bags and manufacturers of 'KRISHNA' Brand Jute Twine in all plys and jute yarn in Spools & Cops.

ప్రయత్నించి చూడవచ్చు. కింద పడుతుందో పడదో!

కార్లలోంచి సీతాకోక చిలకల్లాంటి వారు దిగి హాల్లోకి వెడుతున్నారు. చూడటానికి మరో రెండు కళ్ళుంటే బావుండును.

"హల్లో గురువా" అన్నాడు సుబ్బారావు పక్కకొచ్చి.

"పొద్దున్నే నిద్రలేచావు. ఇక్కడున్నావు?" అన్నాను ఆశ్చర్యంగా. నవ్వాడు. "సింపుల్. ఇక్కడ ఈరోజు ప్రఖ్యాత తారలు పాలుగొంటున్న కార్యక్రమం కదా. అందం ఎక్కడుంటుందో అక్కడ మనం వుంటాము."

"తెలుగు నేర్చుకో ముందు.... అవునూ కుర్చీలు నిండిపోతాయి కదా మరి లోపలికి వెళ్ళక ఇక్కడ నిలబడ్డావేం?"

"వెర్రోడివి గురో. ఇంతమంది అందమయిన వాళ్ళని ఇక్కడ చూడడం అయినాక అప్పుడు హాల్లోకి నడవాలి. సీటెటూ ఉండదు, గేట్ల దగర నిలబడాలంటావు. కరెక్ట్. మనం అప్పుడు ఆడవాళ్ళ గేటు దగర! వంటరి జీవితానికి పరమావధి నేత్రానందమే కదా! 'అవకాశం' తగిలే అప్పుడు వేసుకో. కానేపు నిలబడితే ఎవరో ఒకరు దొరక్కపోరు ఖాస్సుగా."

చిరాకేసింది. ఎప్పుడూ ఇదే ధ్యాస. "చవకబారు సెక్స్ పుస్తకాలు నీలాంటి వాడిని పాడుచేస్తున్నాయోయ్ సుబ్బారావు" అన్నాను.

"ఒంట్లో శక్తి ఉన్నది గురో, సటుపంటిది! ప్రస్తుతం మన డిక్షనరీలో రెండే మాటలు—మదిర, మగువ! అవి

# బ్రహ్మజెముడు

పోతూ పోతూ రాతిరి
పొద్దు పువ్వు పూస్తుంది
—పాయర్

అర్థమవుతున్నాయి. అనుభవించడం మన భాగ్యం"

ఇటువంటి వాడికి భవిష్యత్తేమిటి—ఒళ్ళంతా, ఇల్లంతా గుల్లయిపోయి జీవచ్ఛవంలా బ్రతకడం తప్ప! నా దృష్టిని అతని భవిష్యత్తులోకి సారించాను....

బల్ల. బల్లమీద ఖరీదైన సీసాలు. ప్లేటులో చిరుతిండ్లు- కళ్ళు అతనివి వాలి పోతున్నాయి. ఏదో మాట్లాడు తున్నాడు. వెకిలిగా నవ్వుతున్నాడు. ఒకే మాట మళ్ళీ మళ్ళీ మాటాడు తున్నట్లుగా పెదిమలు ఒకే రకంగా కదులుతున్నాయి. ఎదుట మనిషి ఎవరో కనబడటం లేదు. బలమైన సీసా గభాలున లేచింది. అది వణుకుతున్న చేయి బలంగా. విసురుగా కిందికి పగిలింది!

సీసా సుబ్బారావు నెత్తిమీద బలంగా కొట్టుకుంది. ఏం చేసో ఏమో. నోట వెంట రక్తం వచ్చింది. అతని తల వాలి పోతుంటే అంతవరకు బాగుగా ఉన్న డేట్ కాలెండర్లో ముప్పయి అంకె కనబడింది. ఆది వారం కనబడింది. మార్చి నెల కనబడింది. ఎనభయి సంవత్సరం కనబడింది!

అతని ముఖం చూసేసరికి కళ్ళు మూసుకు పోయున్నాయి. బల్ల రక్తంతో నిండి ఉంది. చచ్చి పోయాడు!....

నేను ఉలిక్కిపడి పోయాను. ఎదురుగా నిలబడి ఉన్న సుబ్బారావు వంక చూశాను. అతని ముఖంలో మృత్యువు కొట్టొచ్చినట్లు కనబడింది. వాచీ చూసుకున్నాను. ముప్పయవ తారీఖు. ఆదివారం వుంది. మార్చినెలే. ఎనభయ్యవ సంవత్సరమే! ఈ రోజే!

"మైగాడ్" అన్నాను గభాలున.

"ఏమిటి గురో. విషయమేమి? అలా గాబరా పోయావేమిటి? అలా పిచ్చిగా చూస్తావేమిటి?" అంటున్నాడు సుబ్బారావు.

నాకు ముచ్చెమటలు పోస్తున్నాయి. ఇదే రోజు. సుబ్బారావు చచ్చిపోతాడీ రోజు అతనికి చాలా ప్రమాదం వుంది. అతనికి చెప్పకూడదు. ఎలా? ఎలా?

"ఏమిటయిందయ్యా- పద లోపలికి వెళదాం. హాల్లో వాళ్ళని నే చూసుకున్నానులే"

"మైగాడ్" అన్నాను.

"గాడూ లేదు, డెవిలూ లేదు ఏమిటి చెప్పు నీ బాధ. ఊరికే గాడో, గాడో అంటే ఎలా?"

"ఏం లేదు. ఏం లేదు." అన్నానే కాని ఆలోచన తెగడం లేదు. ఎలా వీడిని రక్షించడం. జాగ్రత్తగా ఉండమని చెబితే నా తలెగిరి పోతుంది. అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చాను. ఒక్కటే మార్గం కనబడింది నాకు. అది అతన్ని ఈ రోజల్లా వదలకుండా ఉండడం. చేటికి చెప్పలా కాపాడేందుకు ప్రయత్నించడం. స్నేహితుడుగా నా ధర్మం అది. బుద్ధులు ఎటువంటివయినా మనిషి మంచి వాడు.

"ఏం గురూ హాల్లోకి వస్తావా?"

"పద. ఇక్కడికేగాదు. నువ్వెక్కడికి వెళ్ళినా నీ వెంట వుంటానీరోజు. నాకు తెలియకుండా నువ్వు ఎక్కడికీ వెళ్ళే వీలు లేదు. మాటాడే వీల్లేదు" అన్నా నావేశంగా.


నవ్వాడు. "ఎక్కడికైనా కేసు తగిలితే అప్పుడు నువ్వుకూడా గదిలోకి వస్తావా మరి!"

"ఊఁ వస్తాను."

"అదీ విషయం. కొంచెం పెర్టీ కావా లంటావు నీకూ కూడా! వెరీగుడ్. ఇన్నాళ్ళకి "మంచి బాలుడ" వయినావు!"

"ఏడిసినట్టుంది. నాకేం అక్కరలేదు గాని నువ్వు మాత్రం నా కన్ను ఎదుటి నుంచి కదలడానికి వీల్లేదు. గుర్తుంచుకో."

ఇద్దరం హాల్లోకి వెళ్ళాం. ఎవరెవరో



స్టేజీ మీద నిలబడ్డారు. ఇంకెవరో వెళ్ళి వారికి మాలలు వేశారు. ఏగిడారు. ఫొటోలు పెట్టుకున్నారు. కుర్రకారు సంతకాల కోసం ఎగబడారు. ఆ తార ఒళ్ళు తమకి తగిలేలా మీద పడి పరవశించి పోతున్నారు.

నా కిపేమీ ఎక్కడం లేదు బుర్రలోకి. సుబ్బారావుని ఎలా గట్టెక్కించడమన్నదే నా ప్రశ్న. తాగకుండా, ఎవతి దగ్గరకీ పోకుండా ఆపగలిగితే!

"హాయ్" అన్నాడు సుబ్బారావు. మా కెదురుగా నిలబడిన ఇద్దరిలో ఒకడు "హాయ్" అని బదులు కూశాడు.

"మీట్ మె ఫ్రంట్ ఆనంద్" అంటూ నన్ను వాళ్ళకి పరిచయం చేశాడు. వారిరువురూ ఎక్కడో కర్ణాటకలో పొలాలు కొని లక్షలు సంపాదిసున్నారట. ఇటు వైపు వాళ్ళే అక్కడ స్థిరపడ్డారన్నమాట!

"చాలా ఆనందం సుబ్బలూ నిన్నీ రోజు కలవడం! ఈ సినిమాలో నన హాండు కూడా కొంచెం ఉందిలే. మావిడ పేరు వేయించాను నిర్మాతగా! అందుకు నువ్వు గ్రహించుకో లేక పోయావు" ముగురూ ఫెళ్ళున నవ్వారు.

నాకు మెల్లిగా భయం బయలుదేరింది. వీళ్ళ తరవాత కార్యక్రమం సీసాలే మరి!

"కంగ్రాట్సు గురో. అయితే మరి మన కేమయినా నాలిక తడపడం వుందా లేక వాడెవడో అన్నట్లు అంతా "పొడే"నా?"

"పొ డే మి టి రా నీ బొంద, మాకూ యిందాకటినుంచి నాలికలు యెగలాక్కుపోతున్నాయనుకో- వేసవికాలం మొదలయిందకద దాహం యెక్కువ" నవ్వాడు నిర్మాత భర్తగారు.

"గురువుగారూ మీ కేంఅభ్యంతరం లేకపోతే ఏ లిటిల్ సిప్" అన్నాడు అందులో జగదీశ్వర్ అన్న తను. రెండవవాడు రమేష్‌ట.

"అబ్బెబ్బె నా కలవాటు లేదులేండి" అన్నాను.

"అయినా కంపెనీకి" అన్నాడు మళ్ళీ.

"ఈశ్వరా. ఆయనకి శిక్ష వేయకురా. వదులు. పో గురో" అన్నాడు సుబ్బారావు వీడుకోలుగా.

నేనెందుకువదులుతాను? "నేనూవస్తాను. నాకూ వేరే పనిలేదు" అన్నాను.

సుబ్బారావు కొంచెం ఇబ్బంది పడిపోతున్నాడు. అయితే పడించుకునే స్థితిలో లేను నేను.

అందరం కలిసి రూముకి చేరుకున్నాము.

సుబ్బారావుకెదురుగా నేను కూర్చున్నాను. ఈశ్వరుడూ, రమేష్, ఒకే సోఫాలో కూర్చున్నారు తలుపుకి దగ్గరగా.



ఒక్క విషయంలో నాకు ధైర్యంగా ఉంది. అది సుబ్బారావుకి చావు వచ్చేపుడు నాకు కనబడిన దృశ్యంలో నలుగురు మనుషులు లేరు. కనుక ప్రస్తుతం భయం లేదన్నది.

చకచక కావలసిన సామానులన్నీ తెప్పించేసుకున్నారు. సీసాలు, షోడాలు- "మధ్యలో డిస్టర్బెన్సు ఉండకూడదు" అన్నాడు ఈశ్వరుడు.

"మా ఈశ్వరుడు ఇప్పుడెలాగున్నాడో తెలియదుగాని గురో. పూర్వ కాలం అయితే మునులు తపసులో కూర్చున్నట్టే- గడ్డాలూ, మీసాలూ పెరిగి పుట్టలు పట్టాలిసిందే! రెండు మూడు రోజులు కదలకుండా తాగేవాడు" అన్నాడు సుబ్బారావు

"లేదు గురూ. ఈ మధ్య లిమిటెడ్. ఔషధ సేవలాగా- అంతే డాక్టరు చెప్పాడు అలా తాగుతుంటే వీలునామా రాసి మరీ తాగమని!"

నవ్వారంతా. రాకపోయినా నేనూ నవ్వేశాను.

మెల్లిగా పలయాలు తిరుగుతున్నాయి. వేడెక్కుతున్నారు. సీసాలు ఖాళీ అయి మూలకి చేరిపోతున్నాయి. వాళ్ళు ఒక గ్లాసు తాగే లోపల సుబ్బారావు మూడు గ్లాసులు ఖాళీ చేసేస్తున్నాడు.

"లాగించు గురు. నీ కోసమే ఈ సిటింగివాళ!" అంటున్నాడీశ్వరుడు మధ్య మధ్య.

సుబ్బారావు మంచి హుషారు మీదున్నాడు. మాట తడబడేస్థితి వచ్చేసింది. కళ్ళు, ముఖమూ యెర్రబడి పోయాయి. కొద్దిగా వూగుతున్నాడు.

"ఇందాక మా గురు-అదే యెదురుగా వున్నాడే. "బుద్ధిమంతుడు" అన్నాడుకద ... ఏమన్నావు గుర్తుందా గురో" అన్నాడు సుబ్బారావు.

"లేదుగాని నువ్వు కానివ్వు యిప్పుడవన్నీ యెందుకు?" అన్నాను. నాకీ తతంగం ఎంత త్వరగా అవుతుందా అనిపిస్తోంది.

"నాన్సెన్స్! మనం చెబుతుంటే ఆపడం —ఎవడు ఆపేది? ఆపకండి. తప్పు! ఈ గురు— ఈశ్వరా—ఈ గురు అన్నాడు కదా ఎక్కడన్నా మంచి ఫిగర్ దొరికితే తనూ వస్తానన్నాడు." అని నవ్వాడు.

నాకు పిగేసింది. "ఛ.ఛ. అలా అనుకోకండి. నువ్వు ఎక్కడికి వెళ్ళినా విన్ను వదలను. నేనూ కూడా ఉంటాను అన్నానంతే! నిజంగానే ఉంటాను కూడా" అన్నాను.

"మార్చకు గురూ. అసలే ఈశ్వరా- గురువుగారికి 'కేసు' వేరే అక్కరలేదు. వీళ్ళ మరదలు లేదు- మ. ర. ద. లు...."

"సుబ్బారావ్" అన్నానేను విసుగ్గా.

"ఒరేయ్ సుబ్బలూ! నువ్వు కాపీయ్. అంగరి విషయాలూ నీకెందుకు' అన్నాడు ఈశ్వరుడు.

"నాన్సెన్స్. ఆపేందుకు నువ్వెవడి

వోయ్?.... మనోడికి మరదలుంది. బ్రహ్మాండమయిన ఫిగర్- చూస్తేచాలు ఒళ్ళు జిల్లుమనాలిసిందే! ఏం గురో ఎప్పుడన్నా ట్రై చేశావా?"

నాకు చిరాకు పెరిగింది. "సుబ్బారావ్ నోరుముయ్ ముందు. అసహ్యంగా మాట్లాడకు. నా కది చెల్లెలాంటిది."

"ష్. అసహ్యం! ఏమిటసహ్యం? ఇంట్లోనే పెట్టుకున్నావుగా మరదల్ని. గొప్ప రసికుడివి గురో- జోహార్లు.... ఈశ్వరా, మరదలుందే గొప్ప ఫిగర్లేగురూ కొలతలు-ఏవీ బస్టు"

"షటప్ సుబ్బారావు మాట మాట్లాడేవా పళ్ళు రాలకొడతాను. జాగ్రత" అన్నాను లేచి నిలబడి. వీడు మామూలుగా ఆగేలా లేడు.

"ఎవరోయ్ షటప్? ఇంట్లో పెట్టుకుని ఇంటి తలుపువేస్తే అంతా షటప్పే. ఓరి- నాకు చెబుతావా రేయ్? ఏం ఫిగర్. నువ్వు వొదుల్తావా?.... చెల్లెలా-మీ ఆవిడా చెల్లెలేనా నీకు? అసలు ఈశ్వరా, వీడి వీడిరదలుందే అంతా వీడి వైఫ్ పోలికే వైఫ్‌కూడా గొప్ప ఫిగర్లే! సీటూ."

నాకు వెర్రికోపం వచ్చేసింది. మాట పూర్తి కాకుండానే అందిన సీసా పట్టుకునిలాగి కొట్టాను. ఆ సీసా సుబ్బారావు తలమీద పగిలిపోయింది. పెద్దగా కేకేశాడు. ముందుకు వాలిపోయాడు.

పారిపోతుంటే అతని చాటునవున్న డేట్ కాలెండరు కనబడింది. ముప్ఫయవ తారీఖు. ఆదివారం. మార్చి ఎనభయి.

కొయ్యబారి పోయాను. సుబ్బారావు కళ్ళు మూసుకుపోయాయి. కన్ను మూసేశాడు! పక్కకి చూశాను. వాళ్ళిద్దరూ లేరు.

నేనే—నేనే—నా భవిష్యత్తు తప్ప అంతా కనబడింది. నేనే హంతకుడ్ని!

ద్రవం అంతా ఒలికి సుబ్బారావు చేతిలో సిగరెట్టుకి కాబోలు అంటుకున్నట్టుంది. భగ భగ మంటలు వస్తున్నాయి.

"మైగాడ్!" అరిచాను పెద్దగా.

బయటనుంచి అల్లకల్లోలంగా అరుపులు వినబడుతున్నాయి. "ఏమండోయ్.... మిమ్మల్నే.... మిమ్మల్నే.... మిస్టర్ ఆనంద్.... ఆనందరావుగారూ...."

పెద్దపెద్దగా అరుపులు!....

స్పృహ వచ్చింది. మంట కనబడింది. నిద్రమత్తు వదిలిపోయింది. కిటికీలోంచి జనం తలకాయ లగుపడుతున్నాయి.

"హమ్మయ్య లేచారు.... ఏమండీ లేచారా. మిమ్మల్నేనండీ. ముందు మంట లార్పండి. తలుపు తీయండి.

నిద్ర పూర్తిగా వదిలింది.

మా ఆవిడ తలుపు తీయమని అరుస్తోంది!

లేచివెళ్ళి తీశాను.

తలుపు తోసుకుని శాంతి వాళ్ళ నాన్న గబగబ లోపలికి వచ్చేసి దుప్పటి ఒక్కలాగులాగాడు. అది తగలబడుతోంది.

"సిగరెటు ఆర్పకుండా పడుకుంటారు. ఏం పని మాస్టారూ" అన్నాడాయన నిష్ఠురంగా.

అప్పటికి అర్థమయింది. నిద్ర పోయాననీ ఇప్పుడే లేచాననీ! "మై గాడ్. పీడకలన్నమాట!" అన్నాను.

అర్థం కానట్లు చూశారు మావిడ, దాని చెల్లెలూను.


దీపావళి శుభాకాంక్షలు!

అన్నిరకాల ప్రకటనలకు స్పష్టమైన బ్లాకులను సమయానికి సమకూర్చే సంస్థ!

స్వతంత్ర ఎంటర్ ప్రైజెస్
లైను టోను & కలర్ బ్లాక్ మేకర్స్
గాంధీనగరం — విజయవాడ-3
ఫోను: 76334

స్వతంత్ర టైపు ఫౌండ్రీ
క్వాలిటీ ప్రింటింగ్ టైప్సు ఉత్పత్తిదారులు & ప్రింటింగ్ ఫర్నిచర్ పంపిణీదారులు
గాంధీనగరం — విజయవాడ-3
ఫోను: 76334

అందమైన అచ్చుపనులకు అన్నిరకాల రమ్యమైన టైపులను అందించే సంస్థ!



**Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada- 10**
**Editor : Puranam Subrahmanya Sarma.**